ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



తమిళనాడు

TAMILNADU

శనివారం 31 మే 2025

కన్నియాకుమారి జిల్లాలో విధ్వంసం

- పెనుగాలులకు కూలిన విద్యుత్ స్తంభాలు
- చల్లబడిన చెన్నై నగరం
- ఆరు జిల్లాలకు వర్షసూచన



తక్కలై రహదారిలో విద్యుత్ తీగలపై పడి ఉన్న చెట్ల కొమ్మలు



సెయింట్ థామస్ మౌంట్‌లో వర్షంలో వాహనాలు



కులశేఖరం వద్ద కూలిన చెట్లను తొలగిస్తున్న అగ్నిమాపక దళం

పెరంబూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లాలో గురువారం రాత్రి నుండి శుక్రవారం వేకువజాము వరకు పెనుగాలులకు వందకు పైగా చెట్లు కూలాయి. 150కి పైగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఆ జిల్లాలో గత వారం రోజులుగా చెదురు మదురుగా వర్షాలు కురుస్తున్నాయి. ఆరోగ్యపురం నుంచి నీరోడి తీరం వరకు ఉన్న సముద్రతీర జిల్లాల్లో అలల తాకిడి అధికమైంది. ఈ నేపథ్యంలో శుక్రవారం వేకువజామున సముద్రతీర ప్రాంతాల్లో పెనుగాలుల వీయడంతో తీరంలోని బోట్లన్నీ బోల్తా కొట్టాయి. అదే విధంగా గ్రామాల్లో సుమారు వందకు పైగా చెట్లు వేర్లతో సహా పెకలించుకుని కూలిపడ్డాయి. ఇరచ్చకులం, నావల్‌కాడు, అచ్చారిపళ్లం, ఈత్తా మొళి ప్రాంతాల్లో చెట్లు కూలిపడటంతో విద్యుత్ స్తంభాలు పడిపోయినట్టు విద్యుత్‌బోర్డు అధికారులు తెలిపారు. కులశేఖరం, కుళిత్తురై, కుళచ్చల్, తక్కలై, కన్నియాకుమారి ప్రాంతాల్లో రహదారులపై పడిన చెట్లను అగ్నిమాపక సిబ్బంది తొలగించారు. ఇదే విధంగా సామితోప్పు ప్రాంతాల్లో చెట్లు కూలి విద్యుత్ స్తంభాలపై పడటంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో అగ్నిమాపక సిబ్బంది, చెట్లను తొలగించే పనుల్లో, విద్యుత్ బోర్డు సిబ్బంది విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలను ఏర్పాటు చేయడంలో తలమునకలయ్యారు.

చల్లబడిన రాజధాని నగరం...

రాజధాని నగరంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. నగరంలో మార్చి నెలాఖరు నుంచే ఎండ తీవ్రత ప్రారంభమైంది. ఏప్రిల్, మే నెలల్లో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా నమోదుకావడంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. ఈ నెల ప్రారంభంలోనే అగ్ని నక్షత్రం ప్రారంభం కావడంతో ఎండ తీవ్రత అధికమైంది. అదే సమయంలో అల్పపీడనం, వాతావరణ మార్పులతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసినా, నగరంలో మాత్రం తేలిక పాటి వర్షం కురిసింది. శుక్రవారం ఉదయం నుంచే ఆకాశం మేఘావృతంగా ఉంటూ మధ్యాహ్నం పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఎండ వేడిమితో అల్లాడిన ప్రజలు వర్షం కురిసి వాతావరణం చల్లబడడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అల్పపీడనం, నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో భారీ, మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఆ ప్రకారం, శని, ఆదివారాల్లో కోయంబత్తూర్, తిరునల్వేలి జిల్లాల్లోని కొండ ప్రాంతాలు, నీలగిరి, తేని, తెన్‌కాశి, కన్నియాకుమారి జిల్లాల్లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతమై, పగటి ఉష్ణోగ్రతలు 35-36 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 25-26 డిగ్రీలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.



సీఎంకు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలుపుతున్న కమల్‌హాసన్

దేశ సంక్షేమం కోసమే డీఎంకేతో పొత్తు

- ఎంఎన్‌ఎం నేత కమల్‌హాసన్

చెన్నై, మే 30 (ఆంధ్రజ్యోతి): దేశ సంక్షేమం కోసమే డీఎంకే కూటమిలో చేరామని మక్కల్ నీదిమయ్యం (ఎంఎన్‌ఎం) అధినేత కమల్‌హాసన్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం డీఎంకే ప్రధాన కార్యాలయమైన అన్నా అరివాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జూన్ 19న జరుగనున్న రాజ్యసభ ఎన్నికల్లో పార్టీకి ఓ సీటిచ్చినందుకుగాను ఆయన స్టాలిన్, డీఎంకే నేతలకు ధన్యవాదాలు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కుదిరిన పొత్తుల ప్రకారం లభించిన రాజ్యసభ స్థానానికి కమల్ పోటీ చేయనున్న విషయం విదితమే. ఈ భేటీ అనంతరం కమల్‌హాసన్ అన్నా అరివాలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. మక్కల్ నీది మయ్యంకు రాజ్యసభ స్థానం కేటాయించినందుకుగాను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులను కలుసుకుని కృతజ్ఞతలు తెలిపానని చెప్పారు. ప్రస్తుతం రాజ్యసభ ఎన్నికల ముందస్తు ఏర్పాట్ల గురించి స్టాలిన్ తనకు సమగ్రంగా వివరించారని తెలిపారు. దేశ సంక్షేమానికి అవసరం కనుకనే డీఎంకే కూటమిలో చేరినట్లు ఆయన చెప్పారు. ఇకపై రాజ్యసభలో రాష్ట్రానికి సంబంధించిన సమస్యలపై మాట్లాడి పరిష్కరించేందుకు దోహదపడతానని చెప్పారు. రాష్ట్ర సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని కమల్ అన్నారు.

2026 ఎన్నికల్లో విజయం సాధిద్దాం

- కార్యకర్తలకు స్టాలిన్ లేఖ

అడయార్, మే 30 (ఆంధ్రజ్యోతి): 'మదురైలో డీఎంకే సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిద్దాం... 2026 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి తీరుదాం' అంటూ డీఎంకే కార్యకర్తలకు పార్టీ అధ్యక్షుడు స్టాలిన్ శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. తన సారథ్యంలోని ద్రావిడ మోడల్ ప్రభుత్వ పనితీరుపై ఏదో ఒక విమర్శ చేయాలన్న ధోరణితోనే విపక్షాల వ్యవహారశైలి ఉంది. వచ్చే ఎన్నికల్లో బలమైన డీఎంకే కూటమిని ఎదుర్కోలేక అనేక పార్టీలను కలుపుకుని కూటమిగా ఏర్పడటం లేదా రహస్యంగా సమావేశమై మంతనాలు జరుపుతున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందులోభాగంగా మదురైలో పార్టీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించాలని భావించి, స్థలాన్ని కూడా రాష్ట్ర మంత్రులు కేఎన్ నెహ్రూ, ఏవీ వేలు, తంగం తెన్నరసు పరిశీలించరని, జూన్ ఒకటో తేదీ ఉదయం 9 గంటలకు మదురైలో పార్టీ సర్వసభ్య సమావేశం జరుగుతుందని స్టాలిన్ తెలిపారు.. ఈ సమావేశం విజయవంతమయ్యేలా సర్వసభ్యులతో పాటు పార్టీ నేతల సహాయ సహకారాలందించాలి. 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు స్టాలిన్ పిలుపునిచ్చారు.

ప్రకృతికి కులం ఉందా?

- కులమతాల ఆలోచనలు విడనాడండి
- ప్రజాస్వామ్య పరిరక్షణ అందరి బాధ్యత
- టీవీకే అధ్యక్షుడు విజయ్



దివ్యాంగ విద్యార్థినీ, విద్యార్థులతో విజయ్

చెన్నై, మే 30 (ఆంధ్రజ్యోతి): కులం, మతం ఆధారిత ఆలోచనలు వీడాలని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ పిలుపునిచ్చారు. టెన్త్, ప్లస్ టూ తరగతుల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు మహాబలిపురంలోని ఓ హోటల్లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విజయ్ బహుమతులు అందించి, అభినందించారు. తొలిగా చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూర్, అరియలూరు, కడలూరు, కళ్లకుర్చి సహా 16 జిల్లాల పరిధిలోని 88 నియోజకవర్గాలకు చెందిన 600 మందికి పైగా విద్యార్థులకు విజయ్ బహుమతులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చదువులో రాణింపు కూడా విజయమేనని, దానిని తాను తిరస్కరించడం లేదన్నారు. ఒకే విషయం గురించి పదే పదే ఆలోచిస్తూ ఒత్తిడికి గురి కావద్దని సూచించారు. ఈ ప్రపంచం చాలా పెద్దదని, అందులో మీరు సాధించాల్సిన విషయాలు ఎన్నో వున్నాయని విద్యార్థులనుద్దేశించి అన్నారు. సరైన ప్రజాస్వామ్యం ఉంటేనే అందరికీ అన్నీ సమానంగా లభిస్తాయన్నారు. ఇప్పటివరకు అవినీతికి పాల్పడని వారిని ఎన్నికల్లో గెలిపించాలని సూచించారు. డబ్బు పంపిణీ చేసి ఎన్నికల్లో విజయం సాధించాలనే సంస్కృతిని ప్రోత్సహించవద్దని సూచించారు.

కులమతాలను దగ్గరకు రానివ్వకండి

పిల్లలను ఏ విషయంలోనూ నిర్బంధించవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేసిన విజయ్ వారికి ఏం ఇష్టమో తెలుసుకుని అందుకు అవసరమైన మార్గం చూపించాలని పిలుపునిచ్చారు. కుల మతాల ఆధారంగా విభజన చేయాలనే ఆలోచనను దరి చేరనీయవద్దని సూచించారు. 'కులం, మతం చూసి రైతులు తమ వస్తువులు విక్రయిస్తారా? అంతెందుకు, ప్రకృతికి కులమతాలున్నాయా? మాదకద్రవ్యాలను మనం ఎలా దూరంగా ఉంచుతున్నామో, అలాగే, ఈ కులం, మతాలను కూడా దూరంగా ఉంచలేమా? వాటిని మీరు ఎంత దూరంలో ఉంచితే అంత మంచిదని విజయ్ హితవు పలికారు. ఇటీవల కాలంలో తంథై పెరియార్‌కే కులం రంగు పులుముతున్నారు. కేంద్ర ప్రభుత్వ సివిల్ సర్వీస్ పరీక్షల్లో కూడా కులం రంగు పులిమేలా ఒక ప్రశ్న వుంది. ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను' అని విజయ్ పేర్కొన్నారు. వేదిక వద్ద వున్న దివ్యాంగ విద్యార్థులతో ముచ్చటించిన విజయ్.. వారితో కొద్దిసేపు గడిపారు.

విజయ్‌పై విమర్శలు వద్దు

- డీఎంకే అసమర్థ పాలనపై ప్రచారం
- పార్టీ శ్రేణులకు ఈపీఎస్ పిలుపు

చెన్నై, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వ అసమర్థ పాలనను ప్రజలకు తెలియజేయాలని, అదే సమయంలో టీవీకే అధ్యక్షుడు విజయ్‌పై ఎలాంటి విమర్శలు చేయవద్దని పార్టీ శ్రేణులకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళని స్వామి (ఈపీఎస్) సూచించారు. రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయంలో ఈపీఎస్ నేతృత్వంలో గురువారం ప్రారంభమైన జిల్లా ఇన్‌చార్జ్‌లు, జిల్లా కార్యదర్శుల సమావేశం రెండో రోజైన శుక్రవారం కూడా కొనసాగింది. తొలిరోజు సమావేశంలో 42 జిల్లాల ఇన్‌చార్జులు, కార్యదర్శులు, రెండో రోజు సమావేశంలో 40 జిల్లాల కార్యదర్శులు పాల్గొన్నారు. జిల్లాల్లో ఏర్పాటుచేసిన బూత్ కమిటీల వివరాలు తెలుసుకున్న ఈపీఎస్.. మిగిలిన ప్రాంతాల్లో జూన్ నెలాఖరులోపు బూత్ కమిటీలు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో బలమైన మెగా కూటమి ఏర్పాటుకానుందని, ఎన్నికల్లో విజయం కోసం కార్యకర్తలు, నేతలు సమష్టిగా కృషిచేయాలన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధిపై విమర్శలు గుప్పించాలని, అదే సమయంలో టీవీకే అధ్యక్షుడు విజయ్‌పై ఎలాంటి విమర్శలు చేయరాదని సూచించారు. రాబోయే ఏడాది కాలంలో నేతలు విహారయాత్రలకు వెళ్లకుండా కార్యకర్తలు, బూత్ కమిటీలను సమన్వయపరచి, డీఎంకే అసమర్థపు పాలనను ప్రజలకు తెలియజేసి పార్టీ మళ్లీ అధికారం చేపట్టేలా ప్రచారం సాగించాలని ఈపీఎస్ పిలుపునిచ్చారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఈపీఎస్



ఎల్సా-3 నౌక ప్రమాదానికి గురైన నేపథ్యంలో సముద్రతీర జిల్లాల్లో చేపట్టాల్సిన చర్యలపై పర్యావరణ, అటవీశాఖ అదనపు ప్రభుత్వ కార్యదర్శి సుప్రియా సాహు, విపత్తుల నిర్వహణశాఖ అదనపు ప్రభుత్వ కార్యదర్శి పి.అముద, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందంతో ఇతర అధికారులతో సచివాలయంలో సమావేశమైన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

పార్టీలో సర్వాధికారిని నేనే

- కోశాధికారి తొలగింపు చెల్లదు
- అనుయాయుల సమావేశంలో అన్బుమణి

చెన్నై, మే 30 (ఆంధ్రజ్యోతి): పీఎంకేలో తండ్రీకొడుకుల మధ్య వివాదం తారాస్థాయికి చేరింది. పీఎంకే అధ్యక్షుడిగా అన్బుమణిని తొలగించినట్లు వ్యవస్థాపకుడైన ఆయన తండ్రి డాక్టర్ రాందాస్ ఇప్పటికే ప్రకటించగా, ఆ అధికారం ఆయనకు లేదని డాక్టర్ అన్బుమణి తెగేసి చెప్పారు. అధ్యక్షుడిగా పార్టీకి సర్వాధికారిని తానేనని, ఎవరినైనా చేర్చుకోవాలన్నా, తొలగించాలన్నా తనకు మాత్రమే అధికారాలున్నాయని అన్బుమణి స్పష్టం చేశారు. తాను అధ్యక్షుడిగా ఉన్నా సాధారణ కార్యకర్తలాగే వ్యవహరిస్తానని, పార్టీ శ్రేణులందరినీ సమైక్యపరచి పార్టీని అభివృద్ధి బాటలో నడిపిస్తానని ప్రకటించారు. శుక్రవారం చెన్నైలో జరిగిన సమావేశంలో తనకు అనుయాయులైన జిల్లా కార్యదర్శులు, ఇన్‌చార్జుల సమావేశంలో అన్బుమణి మాట్లాడుతూ.. పార్టీ వ్యవస్థాపకుడు రాందాస్ ఆశయాలను ఆదర్శంగా తీసుకునే పార్టీని నడిపిస్తానన్నారు. పార్టీలో అయోమయపరిస్థితులున్నాయని, త్వరలోనే అంతా సర్దుకుంటుందని తెలిపారు. గతంలో తాను ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నానని, ఇప్పుడు ఎదురవుతున్న అవమానాన్ని కూడా అధిగమిస్తానని అన్బుమణి చెప్పారు. ఈ ప్రపంచంలో తాను ఎక్కువగా అభిమానించేది, ఆరాధించేది తన తల్లినేనని, అలాంటప్పుడు తన తండ్రి చెప్పినట్లు ఎలా దాడి చేస్తానని ప్రశ్నించారు. తానెప్పుడూ పార్టీ శ్రేణుల్లో ఒకడిగానే వ్యవహరిస్తానని, రాష్ట్రాభివృద్ధే పార్టీ లక్ష్యమని ఆ దిశగానే పార్టీని ముందుకు నడిపిస్తానని వెల్లడించారు. మూడు రోజులపాటు జరుగనున్న జిల్లా నేతల సమావేశాల్లో కొత్త సభ్యుల చేరిక, పాత సభ్యత్వాన్ని రెన్యూవల్ చేయడం తదితర కార్యక్రమాలపై పార్టీ శ్రేణులు దృష్టిసారించాలన్నారు. పార్టీ శ్రేణులు తమ అభిప్రాయాలను నిర్భయంగా తనకు తెలపవచ్చని, పార్టీకి బంగారు భవిష్యత్తు ఉందన్నారు. పార్టీ కార్యకర్తలంతా ధైర్యంగా ముందుకు దూసుకుపోవాలని పిలుపునిచ్చారు. పార్టీలో కలతలు, అభిప్రాయ భేదాలు రావటం సహజమేనని, అవన్నీ కాలానుగుణంగా సమసిపోతాయని అన్బుమణి అన్నారు.



జిల్లా నేతల సమావేశంలో ప్రసంగిస్తున్న పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాస్

చీలిక దిశగా పీఎంకే?

- రోడ్డెక్కిన తండ్రీకొడుకుల వివాదం
- తీవ్ర గందరగోళంలో శ్రేణులు

చెన్నై, మే 30 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వన్నియార్ల ఓటు బ్యాంకు ఎక్కువగా ఉన్న పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) చీలికదిశగా పయనిస్తోంది. వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, ఆయన కుమారుడు, పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి మధ్య విభేదాలతో ఆ పార్టీ క్యాడర్ తీవ్ర గందరగోళంలో పడిపోయింది. పీఎంకే యువజన విభాగాధ్యక్షుడిగా రాందాస్ మనవడిని నియమించడంతో ప్రారంభమైన ఈ వివాదం.. అతను రాజీనామా చేసినా చల్లారే పరిస్థితి కనిపించడం లేదు. గురువారం దిండివనం తైలాపురంలో అన్బుమణిపై తండ్రి రాందాస్ తీవ్ర విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఆ వేడి సద్దుమణగక ముందే పార్టీ వర్గాలు తన వద్దే ఉన్నాయని నిరూపించేలా అన్బుమణి శుక్రవారం జిల్లా కార్యదర్శులు, ఇన్‌ఛార్జుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఊహించని విధంగా 70 మందికిపైగా జిల్లా నేతలు తరలివచ్చారు. దీంతో పార్టీలో అన్బుమణికి మెజారిటీ సభ్యులు మద్దతిస్తున్నట్లు తెలుస్తోంది. గురువారం రాందాస్ మీడియాతో మాట్లాడుతూ పార్టీలో 108 మంది జిల్లా శాఖ కార్యదర్శులున్నారని, తాను సమావేశం ఏర్పాటు చేసినప్పుడు ఎనిమిది మంది మాత్రమే వచ్చారనీ, ఆ రోజే తాను మానసికంగా క్రుంగిపోయానని చెప్పడం కూడా పార్టీ ఎవరి చేతిలో వుందో ఇట్టే తెలిసిపోతోందని పార్టీవర్గాలు చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో షోళింగనల్లూరులో శుక్రవారం అన్బుమణి ఏర్పాటు చేసిన జిల్లా నేతల సమావేశానికి అపూర్వ స్పందన లభించింది. కాగా తండ్రీకొడుకులు వేర్వేరుగా సమావేశాలు నిర్వహించడం, బల ప్రదర్శ చేస్తుండడం చూస్తుంటే పార్టీలో చీలిక ఖాయమని సీనియర్లు చెబుతున్నారు. ఇంతకాలం రాందాస్ చాటున రాజకీయాలు నడిపిన తాము.. ఇప్పుడేం చేయాలన్నది పెద్ద సంకటంగా మారిందని పీఎంకేకు చెందిన ఓ సీనియర్ నేత వ్యాఖ్యానించారు.

క్లిష్ట పరిస్థితిలో ఉన్నాం...

తండ్రీ కొడుకుల మధ్య ఏర్పడిన మనస్పర్థలపై ఆ పార్టీ గౌరవాధ్యక్షుడు, శాసనసభ్యుడు జీకే మణి మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా జరుగుతున్న సంఘటనలను చూస్తుంటే మనసు భారంగా ఉంటోందని, గౌరవాధ్యక్షుడిగా తాను ఏం చేయాలో కూడా తోచటం లేదని నిర్వేదం వ్యక్తం చేశారు. పార్టీ ప్రస్తుతం క్లిష్టపరిస్థితుల్లో వుందని, పార్టీలో ఐకమత్యం వుండాలని ఆకాంక్షిస్తున్నట్లు తనను కలిసిన మీడియా ప్రతినిధులతో వ్యాఖ్యానించారు.

పార్టీ కోశాధికారి డిస్మిస్...

పీఎంకే అధ్యక్షుడు అన్బుమణికి గట్టి మద్దతిస్తున్న ఆ పార్టీ కోశాధికారి తిలక్ భామను డాక్టర్ రాందాస్ తొలగించి, కోశాధికారిగా సయ్యద్ మన్సూరు హుసేన్ కొనసాగుతారని తెలిపారు. ఆ ప్రకటన వెలువడిన పావుగంటలోపే ఆ తొలగింపు చెల్లదని, కోశాధికారిగా ఆమే కొనసాగుతారని అన్బుమణి ప్రకటించారు. పార్టీలో ఎవరిని తొలగించాలన్నా తన సంతకమే చెల్లుబాటవుతుందన్నారు. ఇదే విధంగా విల్లుపురం నార్త్ జిల్లా కార్యదర్శి మయిలమ్ శివకుమార్‌ను తొలగిస్తూ రాందాస్ చేసిన ఉత్తర్వులు కూడా చెల్లవని అన్బుమణి ప్రకటించారు.

బీజేపీ ప్రమేయం లేదు: నయినార్ నాగేంద్రన్

పీఎంకేలో కొనసాగుతున్న సంక్షోభంతో బీజేపీకి ఏ మాత్రం సంబంధం లేదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ప్రకటించారు. అది పీఎంకే అంతర్గత వ్యవహారం కనుక బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకునే ప్రసక్తే లేదని తెలిపారు. పీఎంకేలో విభేదాలు త్వరలో సమసిపోతాయని భావిస్తున్నట్లు తెలిపారు.

సమాచార దృష్టి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

పెరుంగళత్తూర్: గాంధీ రోడ్డు, కృష్ణా రోడ్డు, ముత్తువేలర్ రోడ్డు, ఎన్టీఓ కాలని, ఆర్ఎంకే నగర్, బారతి నగర్, కామాక్షి నగర్, శేఖర్ నగర్, కల్కి వీధి, డేవిడ్ నగర్, జీఎస్టీ రోడ్డు కొంత భాగం (ఈరనిఅమ్మన్ ఆలయ వెనుక వైపు)

మాదంబాక్కం: పడువంచేరి, అగరం, అన్నై సత్యా నగర్, వెల్కమ్ కాలని, పిళ్లయార్ ఆలయ వీధి, కురింజి నగర్, సాయిబాలాజి నగర్

ముడిచూర్: అముదం నగర్, ఏఎస్ కాలని, అష్టలక్ష్మి నగర్, శాస్త్రి నగర్, భువనేశ్వరి నగర్, రాయప్ప నగర్, వీఎం గార్డన్

నందబాక్కం: మనపాక్కం-కొలపాక్కం రోడ్డు, కాసా గ్రాండ్ కాస్టల్ అండ్ వుడ్ సైడ్, గిరిగోరి నగర్, లక్ష్మీ నగర్, ఇంద్ర నగర్, బీఈఎల్ నగర్, శ్రీరామ్ గార్డన్, మైక్రోమార్వెల్, ధర్మరాజపురం, బీపీసీఎల్ ఫేస్ 1,2, వల్లీశ్వరన్ ఆలయ వీధి, పిళ్లయార్ ఆలయ వీధి.

చెన్నై-కడలూరు రైల్వే లైన్‌కు రూ.52 కోట్లు

పెరంబూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): చెన్నై-మహాబలిపురం-పుదుచ్చేరి-కడలూరు కొత్త రైలు మార్గం ప్రాజెక్ట్‌కు రూ.52 కోట్లు కేటాయించిన నేపథ్యంలో, తొలివిడత పనులు ప్రారంభించనున్నారు. ఈ విషయమై దక్షిణ రైల్వే అధికారులు మాట్లాడుతూ... రాజధాని నగరం నుంచి తెట్లా జిల్లాలకు వెళ్లే రైలు మార్గం అనుసంధానం చేసేలా ఈ ప్రాజెక్ట్ రూపొందించామన్నారు. గత బడ్జెట్‌లో ఈ ప్రాజెక్ట్‌కు రూ.1,000 మాత్రమే కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.52 కోట్లు కేటాయించారని, అందువల్ల ప్రాజెక్ట్ తొలివిడత పనులు ప్రారంభించనున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ త్వరగా పూర్తి చేసేలా రైల్వేతో తమిళనాడు, పుదుచ్చేరి ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తే, ప్రాజెక్ట్ త్వరతగతిన పూర్తయ్యే అవకాశముందన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ప్రయాణికుల రైళ్లతో పాటు గూడ్సు రైళ్ల సేవలు కూడా పెరుగుతాయని అధికారులు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ విధులకు అన్సుల్ మిశ్రా

పెరంబూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): నెలరోజుల జైలు శిక్ష విధించబడిన రాష్ట్ర ఐఏఎస్ అధికారి అన్సుల్ మిశ్రా కేంద్ర ప్రభుత్వ విధులకు బదిలీ అయ్యారు. తమిళనాడు జీవనాధార అభివృద్ధి బోర్డు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న అన్సుల్ మిశ్రా, చెన్నై కార్పొరేషన్ అభివృద్ధి కమిషన్ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో న్యాయస్థానం ఉత్తర్వులు అమలుచేయలేదు. ఈ వ్యవహారంపె దాఖలైన కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కేసులో, ఆయనకు నెల జైలుశిక్ష విధిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన అప్పీలు చేసుకోవడంతో జైలుశిక్ష నిలిపివేసింది. ఈ నేపథ్యంలో, ఆయన కేంద్ర ప్రభుత్వ పనులకు బదిలీ అయి, ఢిల్లీ ఎయిమ్స్ అదనపు డైరెక్టర్‌గా నియమితులయ్యారు.

రెడ్ క్రాస్ సంఘం ఎన్నికలు

● 4,5 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ

పెరంబూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ సంఘం చెన్నై జిల్లా నిర్వాహక కమిటీ పదవులకు నిర్వహించే ఎన్నికల్లో పోటీచేసేందుకు ఆసక్తి ఉన్న వారు జూన్ 4,5 తేదీల్లో నామినేషన్లు దాఖలుచేసుకోవచ్చు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ విడుదల చేసిన ప్రకటనలో.... చెన్నై రెడ్‌క్రాస్ సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం జూన్ 21వ తేది ఉదయం 9.30 గంటలకు విల్లివాక్కంలోని సింగారం పిళ్లై హయ్యర్ సెకండరీ పాఠశాలలో జరుగుతుందన్నారు. సభ్యులు తమ గుర్తింపుకార్డు, ఆధార్ కార్డు, నగదు చెల్లించిన రసీదు, జీవితకాల సభ్యత్వ సర్టిఫికెట్ తదితరాలు తప్పక తీసుకురావాలన్నారు. ఈ నేపథ్యంలో, నిర్వహణ కమిటీ సభ్యుల పదవులకు నిర్వహించనున్న ఎన్నికల్లో ఆసక్తి కలిగిన వారు 4,5 తేదీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని అందించాలని, పోటీచేసే అభ్యర్థుల తుది జాబితా 7వ తేది విడుదల చేస్తామని కలెక్టర్ తెలిపారు.

3న ఎలక్ట్రికల్ బస్సుల ప్రారంభం

పెరంబూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎలక్ట్రికల్ బస్సు సేవలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ జూన్ 3వ తేది ప్రారంభించనున్నారు. రాజధానిలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేలా పలు చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా 2025 చివరినాటికి నగరంలో 625 ఎలక్ట్రికల్ బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆధునిక వసతులతో కూడిన 120 ఎలక్ట్రికల్ బస్సులు ప్రస్తుతం నగరంలోని వివిధ డిపోల్లో ఉంచారు. ఆయా డిపోల ప్రాంగణంలో బస్సులకు చార్జింగ్ పాయింట్లు కల్పించారు. ఈ నేపథ్యంలో, ఎలక్ట్రిక్ బస్సు సేవలను 3వ తేది సీఎం ప్రారంభించనున్నారని రవాణా శాఖ అధికారులు తెలిపారు.

ఎయిడ్స్, క్యాన్సర్ చికిత్సకు సంబంధించిన ప్రకటనలపై నిషేధం

పెరంబూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్, క్యాన్సర్, మధుమేహం వంటి వ్యాధులకు సరైన చికిత్స చేస్తామనే ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు చేపడతామని ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రాష్ట్ర డ్రగ్ లైసెన్సింగ్ అధికారి శ్రీధర్ మానేక్ష హెచ్చరించినట్లు అధికారులు తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, కేంద్ర ప్రభుత్వం మధ్య జరిగిన కేసులో సుప్రీం కోర్టు కొన్ని ఆదేశాలు జారీచేసిందన్నారు. ఆ ప్రకారం, అభ్యంతరకరమైన ప్రకటనలను నిషేధించామన్నారు. అంధత్వం, క్యాన్సర్, స్ట్రోక్, గుండె జబ్బులు, మూత్రపిండాల్లో రాళ్లు, నాడీ వ్యవస్థ సమస్యలు, అపెండిసైటిస్, ఉబ్బసం సహా 56 వ్యాధులకు నాణ్యమైన చికిత్స చేస్తామని సామాజిక మాధ్యమాలు సహా ఎలాంటి మీడియాలో ప్రచారం చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. నిషేధం ఉల్లంఘించిన వారిపై కోర్టు ధిక్కారం, శిక్షార్హమైన నేరమని తెలిపారు. అలాంటి ప్రకటనలపై ప్రజలు complaintsdmrtn@gmail.com అనే ఈ-మెయిల్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

2వ తేదీ పాఠశాలలు ప్రారంభం

పెరంబూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 1 నుంచి 12వ తరగతి విద్యార్థులకు జూన్ 2వ తేది పాఠశాలలు ప్రారంభమవుతాయని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. జూన్ 2న పాఠశాలలు ప్రారంభం వాయిదాపడిందని, 9వ తేది నుంచి పాఠశాలలు ప్రారంభమవుతాయని సామాజిక మాధ్యమాల్లో వార్తలు వెలువడుతున్నాయి. ఈ విషయమై పాఠశాల విద్యాశాఖ స్పందిస్తూ... సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు నమ్మొద్దని, ఇప్పటికే ప్రకటించిన విధంగా జూన్ 2వ తేది పాఠశాలలు ప్రారంభమవుతాయని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది.

ఐల్యాండ్ గ్రౌండ్స్‌లో అట్టహాసంగా ప్రారంభమైన చేపల పండుగ



ఫిష్ ఫెస్టివల్‌ను ప్రారంభించి స్టాల్‌లో చేపలతో తయారైన వంటకాలను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

పెరంబూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐల్యాండ్ గ్రౌండ్స్‌లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో 'ఫిష్ ఫెస్టివల్' శుక్రవారం ప్రారంభమైంది. ఈ చేపల పండుగను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రారంభించారు. అదే విధంగా అక్వేరియం కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యశాఖమంత్రి అనితా రాధాకృష్ణన్, ఎంపీ దయానిధి మారన్ తదితరులు పాల్గొన్నారు. ఆదివారం వరకు ఉదయం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు కొనసాగే ఈ చేపల పండుగలో వంద రకాల రొయ్యలు, చేపలతో చేసిన రకరకాల వంటల రుచి చూడొచ్చు. ప్రదర్శనలో భాగంగా వంటల పోటీలు నిర్వహించనున్నారు. అలాగే రంగు రంగుల చేపల ప్రదర్శన (అక్వేరియం) కూడా ఏర్పాటు చేశారు. చేపలు, రొయ్యల పెంపకం పద్ధతులపై కూడా ప్రదర్శన జరుగుతుందని. మొత్తం 53 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.



ముగిసిన ఏర్కాడు ఫ్లవర్ షో

పెరంబూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): పేదల ఊటీగా పిలిచే ఏర్కాడులో వేసవి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన 48వ ఫ్లవర్ షోను 3 లక్షల మంది వీక్షించినట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. పర్యాటక, ఉద్యానవన శాఖలు, జిల్లా యంత్రాంగం తరఫున ఈ నెల 23 నుంచి 29వ తేది వరకు నిర్వహించిన పుష్ప ప్రదర్శనలో సుమారు 1.5 లక్షల రంగు రంగుల పుష్పాలతో రూపొందించిన మేట్టూరు డ్యాం 16 క్రస్ట్ గేట్లు సహా పలురకాల జంతువులు నమూనాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకున్నాయని అధికారులు తెలిపారు.

కుట్రాలంలో ఆరో రోజూ పర్యాటకుల స్నానాలు నిషేధం

పెరంబూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతం కుట్రాలం జలపాతానికి పర్యాటకులను ఆవర రోజైన శుక్రవారం కూడా అనుమతించలేదు. పశ్చిమ కనుమల కొండ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కుట్రాలం జలపాతాల వద్ద నీటి ఉధృతి అధికంగా ఉండడంతో పర్యాటకులను అనుమతించలేదు. శుక్రవారం కూడా నీటి ఉధృతి కొనసాగడంతో పర్యాటకులను అనుమతించలేదు. పర్యాటకులు జలపాతాల వద్దకు వెళ్లకుండా అటవీ శాఖ సిబ్బంది గస్తీ పనులు చేపట్టారు.



బంగ్లాదేశీయుల చొరబాటు?

● తిరుప్పూరులో ముమ్మర తనిఖీలు

చెన్నై, మే 30 (ఆంధ్రజ్యోతి): బనియన్ల తయారీ నగరం తిరుప్పూరులో కార్మికుల ముసుగులో బంగ్లాదేశీయులు చొరబడ్డారనే సమాచారం అందటంతో పోలీసులు ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. రాష్ట్రంలో వేసవి సెలవుల తరువాత విద్యా సంస్థలు పునఃప్రారంభం కానుండటంతో తిరుప్పూరులోని బనియన్ తయారీ కర్మాగారాలన్నీ యూనిఫామ్ దుస్తులు తయారీలో నిమగ్నం కానున్నాయి. అదే సమయంలో ఆ కర్మాగారాల్లో కొత్త కార్మికులను అధిక సంఖ్యలో తాత్కాలిక పద్ధతిన నియమించనున్నారు. ఇదే అదనుగా బనియన్ల కర్మాగారంలో తాత్కాలిక కార్మికులుగా చేరేందుకు బంగ్లాదేశ్‌కు చెందిన యువకులు వీసాలు, పాస్‌పోర్టులు లేకుండా తిరుప్పూరుకు వచ్చే అవకాశాలున్నాయని ఇంటెలిజెన్స్ అధికారులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి నుండి శుక్రవారం వేకువజాము వరకు తిరుప్పూరులోని లాడ్జీలు, రెస్టారెంట్లు, మేన్షన్లలో ప్రత్యేక దళం పోలీసులు తనిఖీలు చేపట్టారు. పలువురు అనుమానితులను నిర్బంధంలోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. తిరుప్పూరులో ప్రస్తుతం కార్మికులుగా ఉన్న ఉత్తరాది కార్మికుల వద్ద కూడా ఈ తనిఖీలు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం నుండి సాయంత్రం వరకూ తిరుప్పూరు నగరమంతటా తనిఖీలకు వెళుతున్న ప్రత్యేక దళం పోలీసుల సందడే అధికంగా కనిపించింది.



తిరుప్పూరులో ఉత్తరాది కార్మికులను ప్రశ్నిస్తున్న ప్రత్యేక పోలీసు దళం

కొత్తగా మరో నాలుగు డిగ్రీ కళాశాలలు

● సీఎం స్టాలిన్ ఆదేశం

అడయార్, మే 30 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థులు మరింత లబ్ధి పొందేలా రాష్ట్రంలో మరో నాలుగు కొత్త ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలను స్థాపించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారు. ఈ విషయంపై ప్రభుత్వం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. పుదుమై పెణ్, తమిళ్ పుదల్వన్ వంటి పథకాల కారణంగా రాష్ట్రంలో ఉన్నత విద్యా కోర్సుల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఇందుకనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఈ నెల 26న కొత్తగా 11 డిగ్రీ కాలేజీలను ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. వీటిలో 2025-26 విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. అయితే, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మరింత మేలు చేకూర్చేలా కాలేజీలను స్థాపించాలనే వినతి మేరకు వేలూరు జిల్లా కేవీ కుప్పం, తిరుచ్చి జిల్లా దురైయూరు, కల్లకుర్చి జిల్లా ఉళుందూరుపేట, తిరువణ్ణామలై చెంగం ప్రాంతా ల్లో నాలుగు కొత్త కాలేజీలను ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. ఈ ఆదేశాలతో ఈ ప్రాంతాలకు చెందిన 1120 మంది విద్యార్థులు లబ్ధి పొందుతారని ప్రభుత్వం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొంది.

వైగో సోదరికి సీఎం స్టాలిన్ నివాళి

అడయార్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో సోదరి సరోజ అమ్మయార్ కన్నుమూయగా, ఆమె భౌతికకాయానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం నివాళులర్పించారు. ఆ తర్వాత తన సంతాపాన్ని తెలియజేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో రెండో సోదరి సరోజ అమ్మయార్ మృతివార్త తనను ఎంతో బాధకు గురిచేసింది. తన సోదరిపై ఎల్లలులేని ప్రేమాభిమానాలను చూపిన వ్యక్తి వైగో. తన తోబుట్టువును కోల్పోయి దుఃఖ సాగరంలో ఉన్న వైగోకు తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేస్తున్నాను' అని పేర్కొన్నారు.

ఎల్‌బీఈటీ పన్ను 4 శాతానికి తగ్గింపు

● ప్రభుత్వం జీవో జారీ

అడయార్, మే 30 (ఆంధ్రజ్యోతి): తమిళ చలన చిత్రాలకు వసూలు చేసే లోకల్ బాడీ ఎంటర్‌టైన్మెంట్ ట్యాక్స్ (ఎల్‌బిఈటి)ను 8 శాతం నుంచి 4 శాతానికి తగ్గిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తమిళ చిత్రపరిశ్రమ ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీన్ని నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్ సహా పలువురు కోలీవుడ్ నటులు స్వాగతిస్తున్నారు. ఈ మేరకు నడిగర్ సంఘం ప్రతినిధులు, హీరోలు వేర్వేరుగా పత్రికా ప్రకటనలు విడుదల చేసి, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

రోడ్లపై ఆక్రమణల తొలగింపు

● బీజేపీ నేతల ధర్నా



పోలీసులతో వాగ్వాదానికి దిగిన బీజేపీ నేతలు - దుకాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

తిరుత్తణి, మే 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మున్సిపాలిటీ పరిధిలో రోడ్లపై ఏర్పాటు చేసుకున్న దుకాణాలను శుక్రవారం ఉదయం అధికారులు తొలగించారు. వివరాలిలా.. తిరుత్తణి కమలా థియేటర్ సమీపంలోని బస్టాండు వద్ద ఏసీ బస్టాప్‌ను నిర్మించాలనే నిర్ణయించి, ఆ రోడ్డులో అక్రమంగా నిర్మించుకున్న 9 దుకాణాలను తిరుత్తణి మున్సిపల్ అధికారులు తొలగించారు. ఈ క్రమంలో ఏడేళ్లుగా వ్యాపారాలు చేస్తున్నామని, ఉన్నఫలంగా దుకాణాలను కూల్చివేస్తే మేము ఎక్కడికి పోవాలంటూ ఆందోళనకు దిగారు. వీరికి స్థానిక బీజేపీ నేతలు కూడా మద్దతు తెలిపి, నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, ఆందోళన విరమించమని కోరగా, దుకాణదారులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు బీజేపీ నేతలను అరెస్టు చేస్తామని హెచ్చరించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తతకు చేరుకుంది. ఈ విషయం తెలుసుకున్న డీఎస్పీ కందన్ ఆ ప్రాంతానికి చేరకుని, అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించుకున్నారు.

ఘనంగా వరసిద్ధి వినాయక ఆలయ కుంభాభిషేకం



గర్భాలయంలో వరసిద్ధి వినాయకుడు - ఆలయ నిర్వాహకులు

తిరుత్తణి, మే 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపం ఈడిగపేటలో గ్రామంలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవం శుక్రవారం ఉదయం ఘనంగా జరిగింది. బుధవారం ప్రారంభమైన ఈ ఆలయ వేడుకలు శుక్రవారం జరిగిన కుంభాభిషేకంతో ముగిశాయి.ఈ మూడు రోజులుగా యాగశాలలో శివార్చకుల ఆధ్వర్యంలో హోమాలు జరిపించారు. శుక్రవారం తెల్లవారుజామున 4గంటలకు యాగ పూజలు, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు గుడి నిర్వాహకులు అన్నప్రసాదం పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు మునయ్య, సుబ్రమణ్యం, చంద్ర, మునికృష్ణయ్య, మోహన్, దొరబాబు, కరుణ, మహేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

రద్దీ ప్రాంతాల్లో ఆర్వో వాటర్ సెంటర్లు

చెన్నై, మే 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో జనంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో స్వచ్ఛమైన నీటిని నగరవాసులకు అందించేందుకు చెన్నై మెట్రోవాటర్ బోర్డు అధికారులు సన్నాహాలు చేపడుతున్నారు. మెట్రోవాటర్ బోర్డు కొళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తోంది. నగరంలో జనం రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నగరవాసులు తాగునీటి కోసం అల్లాడుతుంటారు. ఈ నేపథ్యంలోనే చెన్నై మెట్రోవాటర్ బోర్డు సంస్థ అధికారులు నగరంలో పరిశీలించి జనం ఎక్కువగా ఉండే 50 ప్రాంతాలను గుర్తించారు. ఆ ప్రాంతాల్లో ఆర్వో నీటిని ఉచితంగా అందజేయనున్నారు. ఆ మేరకు మెరీనా బీచ్, పాండీబజార్, మైలాపూరు, తండయార్‌పేట, కొరుక్కుపేట, అడయార్, ఎగ్మూరు, ప్యారీస్ కార్నర్, కోయంబేడు సహా 50 ప్రాంతాల్లో ఈ ఆర్వో వాటర్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. రూ.5కోట్లతో ఏర్పాటయ్యే ఈ ఆర్వో వాటర్ సెంటర్లను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ త్వరలో ప్రారంభించనున్నారని అధికారులు తెలిపారు. ప్రతి సెంటర్ వద్ద 3 వేల లీటర్ల సామర్థం కలిగిన నీటి తొట్టెను ఏర్పాటు చేసి శుద్ధీకరించిన తాగునీటిని అందిస్తామన్నారు. ఈ సెంటర్లలో నగరవాసులు లీటర్ వరకు తాగునీరు తాగవచ్చని, 150 మిల్లీలీటర్ల చొప్పున కూడా తాగునీరు సరఫరా అవుతుందని, వీటిని సంబంధించిన బటన్స్ కూడా ఉంటాయన్నారు.

స్కానింగ్ కోసం వచ్చిన మహిళపై లైంగిక వేధింపులు

పెరంబూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): 'స్కానింగ్ కోసం వచ్చిన మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రైవేటు ఆసుపత్రి ఉద్యోగిని పోలీసులు అరెస్ట్ చేశారు. రెడ్‌హిల్స్ సమీపం ఓ ప్రాంతానికి చెందిన మహిళ అనారోగ్యంతో పాడియనల్లూర్ చెక్‌పోస్ట్ సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చింది. ఆమెను పరీక్షించిన వైద్యులు 'సీటీ స్కాన్' చేయించుకురావాలని సూచించారు. ఆ సమయంలో స్కాన్ సెంటర్‌లో ఉన్న ఉద్యోగి ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. కేకలు వేస్తూ బయటకు వచ్చిన ఆమె, చోళవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు ఆస్పత్రి ఉద్యోగి రాజ్‌కుమార్ ను అరెస్ట్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

పెరంబూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతిచెందగా, ఓ మహిళకు తీవ్రగాయాలైన ఘటన నాగపట్టణం జిల్లాలో చోటుచేసుకుంది. నాగపట్టణం జగన్నాథపురం వెస్ట్ ప్రాంతానికి చెందిన ఆనందరాజ్, చెన్నైకి చెందిన కార్తీక్‌లు నాగూర్ నుంచి ద్విచక్రవాహనంలో బయల్దేరారు. ఆళియూర్ జంక్షన్ సమీపంలో వీరి బైక్ కూత్తూర్ వన్నన్‌కుళం ప్రాంతానికి చెందిన వినోద్‌బాబు, ఆయన భార్య సింధు భైరవి వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో బైక్ నుంచి కిందపడిన కార్తీక్‌పై వెనుక నుంచి వస్తున్న లారీ దూసుకెళ్లింది. ఈ ఘటనలో కార్తీక్, వినోద్‌బాబు ఘటనా స్థలంలోనే మృతిచెందారు. తీవ్రగాయాలైన ఆనందరాజ్, సింధు భైరవిలను చుట్టుపక్కల వారు నాగపట్టణం ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రికి తరలించగా, మార్గమధ్యంలో ఆనందరాజ్ మృతిచెందాడు. సింధు భైరవి పరిస్థితి విషమంగా ఉందని, ఐసీయూలో చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై నాగూర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

వీధికుక్క దాడిలో పది మందికి గాయాలు

పెరంబూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): నడచి వెళుతున్న వారిపై వీధికుక్క దాడిచేసిన ఘటనలో 10 మందికి గాయాలయ్యాయి. కోయంబత్తూర్ జిల్లా మేట్టుపాళయంలో శుక్రవారం ఉదయం రోడ్డుపై నడిచి వెళుతున్న వారిపై వీధికుక్క దాడిచేసింది. ఈ ఘటనలో 10 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మేట్టుపాళయం వీధుల్లో అధికమవుతున్న కుక్కలను నియంత్రించాలని ఆ ప్రాంత వాసులు జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

9 కేజీల గంజాయి స్వాధీనం

● ముగ్గురి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు ముత్తుకుమార్, నిర్మల్‌కుమార్, సూర్య

తిరుత్తణి, మే 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడు చెక్‌పోస్ట్‌లో గురువారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో వేగంగా వెళ్తున్న ఓ కారును ఆపి, తనిఖీ చేయగా, 9 కిలోల గంజాయి గుర్తించారు. దీనికి సంబంధించి కారులో ప్రయాణిస్తున్న ముగ్గురిని అరెస్టు చేశారు. తంజావూరుకు పట్టుకోటై ప్రాంతానికి చెందిన ముత్తుకుమార్, నిర్మల్‌కుమార్, సూర్యలను అదుపులోకి తీసుకుని, కారు సహా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వీరు గంజాయిని ఆంధ్రప్రదేశ్ నుండి తంజావూరు తరలిస్తున్నట్లు సమాచారం. వీరిపై కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ప్రియురాలు మాట్లాడలేదని విద్యార్థి ఆత్మహత్య

పెరంబూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రియురాలు మాట్లాడలేదని మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చెంగల్పట్టు జిల్లాలో చోటుచేసుకుంది. హనుమంతపుతేరి వరదరాజనగర్ ప్రాంతానికి చెందిన సెల్వగణేష్‌కు భార్య, నలుగురు కుమారులున్నారు. రెండో కుమారుడు మొళిలరసన్ (19) బీసీఏ రెండో సంవత్సరం చదువుతున్నాడు. అతడు తనతో చదివే విద్యార్థినిని ప్రేమిస్తున్నట్లు సమాచారం. వీరిద్దరి మధ్య ఏర్పడిన విబేధాల కారణంగా విద్యార్థిని తనతో మాట్లాడడం లేదనే బాధతో మొళిలరసన్ గతంలో రెండు సార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్పటికీ కూడా ఆమె మాట్లాడకపోవడంతో గురువారం రాత్రి ఇంటి మిద్దెపై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై చెంగల్పట్టు నగర పోలీసులు కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

తిరుమల యాత్ర పేరుతో మోసం !



డబ్బులు తీసుకున్న వ్యక్తి

చెన్నై, మే 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక షావుకారుపేటలోని బంగారు వ్యాపారిని తిరుమల యాత్రకు తీసుకెళ్తానని, క్షణాల్లో స్వామివారి దర్శనం కల్పిస్తానని మాయమాటలతో నమ్మించిన వ్యక్తి రూ.45 వేలతో ఉడాయించాడు. శుక్రవారం ఉదయం తిరుమలకు తీసుకెళతానని ఆ మోసగాడు చెప్పిన మాటలు నమ్మి ఆ వ్యాపారి సహా ఎనిమిదిమంది ప్రయాణానికి సిద్ధమై, చివరకు మోసపోయామని తెలుసుకున్నారు. తులాభారం షాపు నడుపుతున్న ఆ వ్యాపారి దగ్గరకు ఇటీవల సురేష్ అనే వ్యక్తి వచ్చి తిరుమలలో తనకు పలుకుబడి ఉందని, క్షణాల్లో దర్శనం చేయిస్తానని చెప్పాడు. అతడి మాటలను నమ్మి ఆ వ్యాపారి రైలు టికెట్‌కు, దర్శనం టికెట్లకు, కొండపై వ్యాన్ సదుపాయానికంటూ రూ.20వేలకు పైగా నగదు చెల్లించాడు. కొంత నగదు సురేష్ తీసుకోగా, మరికొంత నగదును వినోద్ జాకబ్ అనే వ్యక్తికి జీపే చేయమని చెప్పాడు. ఆ విధంగా ఎనిమిది మందిని తిరుమలకు తీసుకెళతానని సురేష్ డబ్బులు తీసుకుని మోసం చేశాడు.. ఆ తరువాత ఆ ఇద్దరు వ్యక్తుల మొబైల్ నెంబర్లు స్విచ్ఛాఫ్ అని వస్తుండడంతో ఆ వ్యాపారి లబోదిబోమంటున్నారు.

వేప్పేరి రోడ్డులో కారు దగ్ధం

● ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న ఎస్ఐ

చెన్నై, మే 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురుషవాక్కం సమీపం వేప్పేరి వద్ద శుక్రవారం ఉదయం నడిరోడ్డులో కారు దగ్ధమైంది. ఆ కారులో ప్రయాణించిన ఎస్ఐ, కుటుంబ సభ్యులు ప్రాణాపాయం నుండి తప్పించుకున్నారు. వేప్పేరి పోలీసుస్టేషన్‌లో స్పెషల్ ఎస్ఐగా పనిచేస్తున్న మహేశ్వరన్ తన అత్తమామలను ఎగ్మూరు రైల్వేస్టేషన్‌లో విడిచిపెట్టేందుకు కారులో బయలుదేరారు. ఆ కారు సీఎస్ఐ చర్చి సమీపంలో వెళ్తుండగా హఠాత్తుగా కారు ముందు భాగం నుండి మంటలు, పొగలు వచ్చాయి. దిగ్భ్రాంతి చెందిన్ ఎస్ఐ మహేశ్వరన్ కారు ఆపి అత్తమామలను దూరంగా తీసుకువెళ్లారు. ఆ కారు పూర్తిగా మంటల్లో దగ్ధమైంది. అగ్నిమాపక ఇబ్బంది సమాచారం అందుకుని ఆ ప్రాంతానికి వెళ్లి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు.

నిధితో నటిస్తే డిప్యూటీ సీఎంలు అవుతారా?


నిధి అగర్వాల్

యంగ్ హీరోయిన్ నిధి అగర్వాల్‌తో కలిసి నటిస్తే ఉప ముఖ్యమంత్రులు అయిపోతారనే టాక్ సినీ ఇండస్ట్రీలో బాగా వినిపిస్తోంది. కోలీవుడ్‌కు చెందిన ఉదయనిధి, టాలీవుడ్‌కు చెందిన పవన్ కళ్యాణ్ ఇపుడు ఉప ముఖ్యమంత్రులుగా ఉండటాన్ని వారు ఉదహరిస్తున్నారు. గతంలో ఉదయనిధి - నిధి అగర్వాల్ కలిసి 'కళగ తలైవన్' అనే చిత్రంలో నటించారు. ఈ చిత్రం విడుదలై విజయం సాధించింది. ఆ తర్వాత ఉదయనిధి తమిళనాడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఇంతే కాకుండా తెలుగులో పవర్ స్టార్, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ - నిధి అగర్వాల్ కలిసి 'హరి హర వీరమల్లు' చిత్రంలో నటించారు. ఈ మూవీ జూన్ 12వ తేదీ ప్రపంచ వ్యాప్తంగా పాన్ ఇండియా మూవీగా విడుదలకానుంది. ఈ మూవీ ప్రాజెక్టు ఐదేళ్ళ క్రితం ప్రారంభించారు. వివిధ కారణాలతో తీవ్రజాప్యం జరిగింది. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల తర్వాత పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. దీంతో నిధి అగర్వాల్‌ను మంచి రాశి కలిగిన హీరోయిన్‌గా చెప్పుకుంటున్నారు. దీంతో ఆమె కూడా తెగ సంతోషపడిపోతోంది.

పూవైయార్ హీరోగా 'రామ్ అబ్దుల్లా ఆంటోని'


'రామ్ అబ్దుల్లా ఆంటోనీ'లో ఓ దృశ్యం

'మాస్టర్' చిత్రంలో విజయ్‌తో కలిసి నృత్యం చేసిన సూపర్ సింగర్ ఫేం పూవైయార్ హీరోగా పరిచయమవుతున్నారు. అన్నై వేలాంకణ్ణి స్టూడియోస్ పతాకంపై నిర్మాత టీఎస్ క్లెమెంట్ సురేష్ నిర్మాణంలో డెబ్యూ డైరెక్టర్ టి.జయవేల్ దర్శకత్వంలో 'రామ్ అబ్దుల్లా ఆంటోనీ' పేరుతో ఓ చిత్రం తెరకెక్కనుంది. ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఈ మూవీ ఫస్ట్‌లుక్ తాజాగా రిలీజ్ చేశారు. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'పాఠశాలకు వెళ్ళే విద్యార్థులకు కౌమార దశలో వచ్చే మార్పులు, వారి జీవిత అంశాలను ఇతివృత్తంగా తీసుకుని తెరకెక్కిస్తున్నాం. ముగ్గురు విద్యార్థులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వీరు ప్రపంచంలో అతి ముఖ్యమైన సమస్యను సామాజిక బాధ్యతతో చెప్పబోతున్నాం. వేలా రామమూర్తి, తలైవాసల్ విజయ్, సాయిదీనా, శామ్స్, వినోదిని, వైద్యనాథన్ తదితరులు ఇతర పాత్రలను పోషించారు' అని పేర్కొన్నారు.

ఆ చిత్రంతో చాలా మంచి పేరొచ్చింది

● శశికుమార్


అభిషన్ - శశికుమార్

డెబ్యూ డైరెక్టర్ అభిషన్ జీవింత్ రూపొందించిన 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రంతో తనకు చాలా మంచి పేరు వచ్చిందని ఆ మూవీ హీరో శశికుమార్ అన్నారు. 'అయోధ్య' విజయం తర్వాత 'టూరిస్ట్ ఫ్యామిలీ'లో మరో ఘన విజయాన్ని తన ఖాతాలో చేరిందని ఆయన పేర్కొన్నారు. శశికుమార్ - సిమ్రన్ జంటగా అభిషన్ జీవింత్ దర్శకత్వంలో 'టూరిస్ట్ ఫ్యామిలీ' రూపొందగా ఈ నెల 1వ తేదీ విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. శ్రీలంక నుంచి తమిళనాడుకు శరణార్థిగా వచ్చిన కుటుంబం ఎదుర్కొన్న సమస్యలను ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని రూపొందించారు. ఈ మూవీ సక్సెస్‌పై శశికుమార్ స్పందిస్తూ, 'దర్శకుడు అభిషన్ స్టోరీని చెప్పినట్టుగానే స్క్రీన్‌పై ప్రెజెంట్ చేశారు. నేను కూడా దర్శకుడు చెప్పినట్టుగానే నటించాను. సినిమాను తెరకెక్కించిన తీరు చూస్తే అభిషన్ కొత్త దర్శకుడిగా కనిపించలేదు. ఇందులో దర్శకుడు అభిషన్ కూడా ఒక చిన్న పాత్ర పోషించగా, ఆ పాత్ర సినిమాకు భావోద్వేగ బలాన్ని ఇచ్చింది' అని అన్నారు.

థియేటర్లు దక్కేనా?

● 'థగ్ లైఫ్'తో పోటీపడనున్న చిత్రాలు


'పరమశివన్ ఫాతిమా'లో ఓ దృశ్యం

మణిరత్నం - కమల్ హాసన్ కాంబినేషన్‌లో రూపొందిన 'థగ్ లైఫ్' జూన్ 5వ తేదీ విడుదలకానుంది. అదే రోజున ఒక చిత్రం, మరుసటి రోజు(జూన్ 6)న రెండు చిత్రాలు పోటీపడనున్నాయి. అయితే, భారీ అంచనాల మధ్య విడుదలవుతున్న 'థగ్ లైఫ్'కు మిగిలిన మూడు చిన్న చిత్రాలు ఏ మేరకు పోటీ ఇస్తాయన్నదే ఇపుడు ప్రశ్నగా నిలిచింది. ఈ మూడు చిత్రాల ప్రదర్శనకు తగినన్ని థియేటర్లు లభిస్తాయా? ఆ సినిమాలు చూసేందుకు ప్రేక్షకులు థియేటర్‌కు వస్తారా? అన్న ప్రశ్నలు కూడా ఉత్పన్నమతున్నాయి. 'థగ్ లైఫ్'తో పాటు విడుదలయ్యే చిత్రాల్లో 'పరమశివన్ ఫాతిమా', 'పేరన్బుమ్ పెరుంకోబమ్', 'మద్రాస్ మ్యాట్నీ' చిత్రాలున్నాయి. ఇందులో 'థగ్ లైఫ్' చిత్రాన్ని రాష్ట్రంలోని అధికార పార్టీకి చెందిన రెడ్ జెయింట్ మూవీస్‌తో కలిసి మద్రాస్ టాకీస్, ఆర్‌కేఎఫ్‌ఐ నిర్మించాయి. దీంతో రాష్ట్రంలోని అన్ని థియేటర్లను ఆ మూవీకే కేటాయించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఇదే పరిస్థితి వస్తే మిగిలిన మూడు చిత్రాల పరిస్థితి ఏంటి? అన్నది ఇపుడు చర్చనీయాంశంగామారింది. అయితే, పెద్ద సినిమా, చిన్న సినిమా అనేది విడుదలకు ముందు మాత్రమేనని, విడుదలైన తర్వాత ప్రేక్షకాదరణ ఏ చిత్రానికి ఉంటుందో అదే పెద్ద చిత్రమని పలువురు సినీ ప్రముఖులు అంటున్నారు. ఉదాహరణకు మే 1వ తేదీ ముందు సూర్య నటించిన 'రెట్రో' మూవీ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన పెద్ద చిత్రంగా చెప్పుకున్నారు. కానీ, అదే రోజున విడుదలైన 'టూరిస్ట్ ఫ్యామిలీ' బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో ఇటు కలెక్షన్లపరంగా, ప్రేక్షకాదరణలో 'రెట్రో' కంటే పెద్ద చిత్రంగా నిలిచింది. అందువల్ల ముందుగా ప్రకటించినట్టుగానే తమ చిత్రాలను విడుదల చేయనున్నట్టు ఆయా చిత్రాల మేకర్స్ ప్రకటించారు.

చిత్రజ్యోతి

తరుణి



వృత్తిలో ప్రతిభ ప్రవృత్తిలో ప్రజ్ఞ

వృత్తి, ప్రవృత్తుల్లో సమతౌల్యం పాటించడం అందరికీ సాధ్యం కాదు. ఎంతోమంది రెండింటినీ మేళవించుకొనే సామర్థ్యం లేక విఫలమవుతుంటారు. కాని నేటి యువత ఆలోచనలు, లక్ష్యాలు, గమ్యం విభిన్నం, వినూత్నం. వారు మల్టీ టాస్కుల్లో ఆరితేరారు. అందుకే కొంతమంది వృత్తి జీవితానికి, ప్రవృత్తికి సమాన ప్రాధాన్యమిస్తూ ముందుకు దూసుకుపోతున్నారు. అలాంటివారిలో యువకళాకారిణి 'జయంతి ప్రజ్ఞాన దీపిక' ఒకరు. ఆమె వృత్తిరీత్యా 'ఫిజియోథెరపిస్ట్, ప్రవృత్తిరీత్యా నృత్యకళాకారిణి. వృత్తిజీవితంలోని ఒత్తిడిని, నాట్యం ద్వారా దూరంచేసుకుని పోగొట్టుకొని మానసిక ప్రశాంతత పొందుతూ, నాట్యాభ్యాసానికి తగ్గ దృఢత్వాన్ని పెంపొందించుకుంటోంది ప్రజ్ఞాన దీపిక. వృత్తి, ప్రవృత్తులలోనూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్న లక్ష్యసాధనకు పరిశ్రమిస్తున్న 'ప్రజ్ఞాన దీపిక' జీవనప్రస్థానం నేటి 'తరుణి'లో......

- వేళచ్చేరి, ఆంధ్రజ్యోతి


వివిధ నృత్య ప్రదర్శనలలో జయంతి ప్రజ్ఞాన దీపిక హావభావాలు

● వర్ధమాన కూచిపూడి నృత్యకళాకారిణి 'జయంతి ప్రజ్ఞాన దీపిక'

■ పెరిగిందంతా చెన్నైలోనే..

ప్రజ్ఞాన దీపిక పుట్టింది వైజాగ్‌లో. పెరిగినదంతా చెన్నైలోనే. తండ్రి డాక్టర్ శ్రీనివాస్ ఐఐటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. తల్లి జయంతి లలితా కల్పన సంగీత, నాట్యకళాకారిణి. ఆమె కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ ద్వారా ఐఐటీలో నృత్య, సంగీత తరగతులను నిర్వహిస్తున్నారు. ప్రజ్ఞాన దీపికకు ఒక సోదరుడు. చెన్నైలో కేంద్రీయ విద్యాలయంలో పన్నెండోతరగతి వరకూ చదివిన ప్రజ్ఞాన దీపిక ఆ తర్వాత ఫిజియోథెరపీ కోర్సులో చేరింది. చెన్నై పోరూరులోని శ్రీరామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ సైన్సెస్‌లో ఫిజియోథెరపీలో పట్టా పొందింది. ప్రస్తుతం ప్రజ్ఞాన దీపిక ప్రైమల్ పాటర్న్స్ హోలిస్టిక్ ఫిట్‌నెస్ స్టూడియోలో ఫిట్‌నెస్ ట్రైనర్‌గా పనిచేస్తోంది.

కూచిపూడి నాట్యాభ్యాసం ప్రారంభమైందిలా....

ప్రజ్ఞాన దీపిక తల్లి కల్పన కూచిపూడి నాట్యకళాకారిణి కావడంతో ఆమే కుమార్తెకు తొలి గురువు అయింది. తల్లి నాట్యాన్ని చూస్తూ పెరిగిన ప్రజ్ఞాన దీపికకు నాట్యం వారసత్వంగా లభించిన వరం. తల్లి దగ్గర ప్రాథమిక శిక్షణ తీసుకున్న ప్రజ్ఞాన దీపిక ఏడేళ్ల వయసులో కళారత్న, గురువు వెంపటి రవిశంకర్ శిష్యురాలిగా కూచిపూడి నాట్యంలో పట్టుసాధించింది. సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత ఏ.బీ బాలకొండలరావు దగ్గర కూడా ప్రజ్ఞాన దీపిక తన నాట్యానికి మెరుగులు దిద్దుకున్నది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో కూచిపూడి నాట్యంలో సర్టిఫికెట్ కోర్సు డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణురాలైంది.


దీపిక, ఆమె తల్లి కల్పన

■ నాట్యప్రదర్శనలు.....

స్కూలు, కాలేజీలో చదువుకొనే సమయంలోనే ఎన్నో నాట్యప్రదర్శనలు ఇచ్చినప్రజ్ఞాన దీపిక. కేంద్రీయ విశ్వవిద్యాలయంలో చదువుకునే సమయంలో జాతీయ స్థాయిలో సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన సోలో డాన్స్ పోటీల్లో తమిళనాడు తరఫున ప్రాతినిధ్యం వహించింది. చెన్నైలో భారత్ కళాచార్ డాన్స్ ఫెస్టివల్‌లో తన నాట్యప్రదర్శనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. తిరుమల 'నాద నీరాజనం' వేదికపై తన నృత్యప్రదర్శనతో భక్తులను ఆకట్టుకుంది. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్లాసికల్ తమిళ్ నిర్వహించిన 'భారతీయ భాషా ఉత్సవ్' కార్యక్రమంలో ప్రజ్ఞాన దీపిక తన నృత్యంతో అలరించింది. అంతేకాదు తంజావూరులోని బృహన్ నాట్యాంజలి శివరాత్రి నృత్యోత్సవంలో, రామేశ్వరం ఉత్తరకోశమంగై ఆలయం, ముంబయి, రసమయి కల్చరల్ సెంటర్ ఆరోవిల్‌లో, 'ఆరోవిలే డాన్స్‌ఫెస్టివల్' హైదరాబాదు రవీంద్రభారతి ఇవన్నీ ఇమె నృత్యప్రదర్శనకు వేదికలయ్యాయి. చెన్నైలోని వివిధ సభల్లో ఆమె ఎన్నో నృత్యప్రదర్శనలిచ్చి సత్కారాలనందుకున్నది. చాలా ఏళ్లు 'చెంగల్పట్టు' పందనల్లూరు నాట్యాంజలి కార్యక్రమాల్లో నాట్యప్రదర్శనలు ఇచ్చి ఘనత సాధించింది. డా.వెంపటి చినసత్యం రూపొందించిన 'క్షీర సాగరమథనం' నృత్యంలో తను కూడా భాగం కావడం గొప్ప విశేషమని చెప్పిన ప్రజ్ఞాన దీపిక. తమిళనాడు గవర్నర్ సమక్షంలో కూడా నృత్యాన్ని ప్రదర్శించే అవకాశం కలిగిందని తన హర్షాన్ని వ్యక్తం చేసింది. విదేశాల్లో కూడా కూచిపూడి నృత్యప్రదర్శన చేసింది. దూరదర్శన్ కేంద్రం చెన్నైలో కూచిపూడి డాన్స్‌లో బి గ్రేడ్ ఆర్టిస్టుగా కొనసాగుతున్న ప్రజ్ఞాన దీపిక. దేశ,విదేశాల్లో తన తల్లి నేతృత్వంలో జరిగే శిక్షణా శిబిరాల్లో పాలు పంచుకుంటోంది.. నృత్యప్రదర్శనలివ్వడమే కాకుండా తన తల్లి నిర్వహించే నాట్య తరగతుల్లో విద్యార్థులకు శిక్షణలిస్తూ, తన నాట్యానికి కూడా మెరుగులు దిద్దుకుంటుంది ఈ యువ కళాకారిణి.


కుటుంబ సభ్యులతో

■ సంగీతం....

ప్రజ్ఞాన దీపికకు నాట్యంతో పాటు సంగీతంలో కూడా ప్రవేశం ఉంది. తల్లి, సోదరుడు కూడా గాయకులు కావడంతో, ఇంట్లోని సంగీత వాతావరణం ఆమెను సంగీతం వైపు మళ్ళించింది. గురు భాగవతుల సీతారామశర్మ ఆమె శాస్త్రీయ సంగీతానికి శుభారంభం చేశారు. ప్రస్తుతం సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత 'సంగీత సుధానిధి' మండా సుధారాణి దగ్గర శాస్త్రీయ సంగీతం అభ్యసిస్తోంది.

■ వృత్తి ప్రవృత్తుల మేళవింపు....

నాట్యానికి శరీరం దృఢంగా ఉండటం అవసరమని, అందుకు తను నేర్చుకున్న ఫిజియోథెరపీ కోర్సు ఎంతో ఉపకరిస్తుందని ప్రజ్ఞాన దీపిక పేర్కొన్నారు. ఫిజియోథెరపిస్ట్‌గా తన వృత్తి నిర్వహణ తన నాట్యాభ్యాస పురోగతికి ఎంతో దోహదం చేస్తున్నదని, తన వృత్తి,ప్రవృత్తుల అనుసంధానం భవిష్యత్తులో కూడా తనకు మరింతగా ఉపకరిస్తుందని తెలిపింది.

నాట్యంలోను, ఫిజియోథెరపీలోను రెండింటిలో కూడా పి.జి డిగ్రీ సంపాదించాలన్న కోరిక వెలిబుచ్చింది ఆమె కళాకారులకు భక్తి ముఖ్యమని, అప్పుడే వారి విద్య ప్రకాశిస్తుందని, ప్రతిఒక్కరూ నిత్యవిద్యార్థిగా ఉండాలని దీపిక తెలిపింది. సంగీతజ్ఞానం నాట్యానికి మరింత వన్నెతెస్తుందని, పాటల భావాన్ని అర్థం చేసుకుని నాట్యం చేస్తే హావభావాలు ప్రస్ఫుటంగా ప్రదర్శింపబడతాయని పేర్కొన్న దీపిక తన సంగీత నాట్య ప్రస్థానాలకు తల్లిదండ్రుల ప్రోత్సాహమే కారణమని, తన వృత్తి ప్రవృత్తులు సమర్థవంతంగా నిర్వహించగలిగేటందుకు వారి సహాయ సహకారాలే కారణమని తరుణితో తన భావాలను పంచుకుంది.

మెహతా హాస్పిటల్లో ఎన్ఐసీయూ ప్రారంభం


ఎన్ఐసీయూ ప్రారంభోత్సవంలో వైద్యనిపుణులు

చెన్నై, మే 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెట్‌పేట్‌లోని మెహతా హాస్పిటల్‌లో కొత్తగా విస్తరించిన 40 పడకల అత్యాధునిక 'క్వాటర్నరీ కేర్ నియోనాటల్ ఇంటెన్సివ్‌కేర్ యూనిట్ (ఎన్ఐసీయూ) ప్రారంభమైంది. అంతేగాక ఆస్పత్రిలో అంబులెన్స్ ట్రాక్ యాప్ కూడా ఆవిష్కృతమైంది. భారత నియోనాటాలజీ పితామహుడిగా పేరుగాంచిన డాక్టర్ ఆర్.షణ్ముగసుందరం, ఆస్పత్రి నియోనాటాలజీ హెడ్ డాక్టర్ లక్ష్మి, డాక్టర్ అరుణ్ కృష్ణన్ తదితరులు గురువారం దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మీడియాతో మాట్లాడుతూ.. 40 పడకల ఈ ఎన్ఐసీయూ ప్రారంభంతో నియోనాటల్, పెరినాటల్‌కేర్‌లో అత్యుత్తమ కేంద్రంగా ఉండాలనే తమ లక్ష్యాన్ని పునరుద్ఘాటిస్తున్నామన్నారు. తాము మౌలిక సదుపాయాలపై మాత్రమే కాకుండా, పోరాడే అవకాశం, అవసరమైన ప్రతి బిడ్డ భవిష్యత్తుపైనా పెట్టుబడి పెడుతున్నామని వివరించారు.

వంద మీటర్లు వెనక్కు వెళ్లిన సముద్రం


సముద్రం వెనక్కి వెళ్లిన దృశ్యం

పెరంబూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా దేవిపట్టణం, తిరుపాలైకుడి, సంబై తదితర తీరప్రాంతాల్లో సముద్రం వంద మీటర్ల దూరం వెనక్కి వెళ్లింది. దీంతో, తీరప్రాంతంలో లంగరు వేసిన పడవలు నేలపై ఉన్నట్లు దర్శనమిచ్చాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా సముద్రం వెనక్కి వెళ్లి ఉండవచ్చని మత్స్యశాఖ అధికారులు భావిస్తున్నారు.

మహిషాసుర మర్ధినికి వెండి కవచం

● బహూకరించిన మంత్రి శేఖర్‌బాబు సతీమణి


అమ్మవారికి వెండి కవచం బహూకరిస్తున్న మంత్రి సతీమణి శాంతి

తిరుత్తణి, మే 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ ఆలయానికి అనుసంధానంగా ఉన్న అరుల్మిగు మహిషాసుర మర్ధిని ఆలయంలో హిందూ దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు సతీమణి శాంతి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆమెకు స్వాగతం పలికి, అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం ఆమె రూ.78 లక్షలు విలువైన వెండి కవచం, కిరీటం, వెండి పాదాలను ఆలయ జాయింట్ కమిషనర్ రమణి, ట్రస్టీ సురేష్‌బాబు ఆధ్వర్యంలో అమ్మవారికి బహూకరించారు. ఆ తర్వాత ఆలయ నిర్వాహకులు ఆమెకు ప్రసాదాలను అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు.


ఇటీవల రాష్ట్రపతి నుంచి పద్మభూషణ్ అవార్డు స్వీకరించిన ప్రముఖ పారిశ్రామికవేత్త నల్లికుప్పుసామి శెట్టి సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్న దృశ్యం


ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను సచివాలయంలో కలుసుకున్న ఏడో ఆర్థిక సంఘం అధ్యక్షుడిగా నియమితులైన కె.అల్లావుద్దీన్.

కున్నూరులో కొండజాతి పంటల ప్రదర్శన

● జీడిపప్పుతో జింకలు, తాటాకులతో కోడిపుంజులు



చెన్నై, మే 30 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలోని ఊటీలో గులాబీ ప్రదర్శన, సమ్మర్ సీజన్ ఫలపుష్ప ప్రదర్శన ముగియడంతో కున్నూరు కాట్టేరి పార్కులో శుక్రవారం ఉదయం కొండజాతి పంటల ప్రదర్శన ప్రారంభమైంది. పర్యాటకులను ఆకట్టుకునేలా తాంటిముంజెలు, కొబ్బరి, తాటాకులతో స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. తాటాకులతో కోడిపెట్టలు, కోడి పుంజులు, బాతులు, మేకలు, పశువులు, ఎద్దులబండి రూపంలో తయారైన సెట్టింగ్‌లు చూపరులకు ఆకట్టుకుంటున్నాయి. ఈ ఉద్యానవనంలో యేడాది క్రితం నాటిన పూలమొక్కలన్నీ ఏపుగా పెరిగి వికసించడంతో పర్యాటకులు తమ సెల్‌ఫోన్‌లో బంధించారు. ప్రస్తుతం నీలగిరి జిల్లాలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఈ ప్రదర్శనకు పర్యాటకులు అధిక సంఖ్యలో విచ్చేస్తారని నిర్వాహకులు భావిస్తున్నారు.

తాటిపండ్లు, కొబ్బరి బొండాలతో రూపొందించిన ఇల్లు


కాట్టేరి పార్కు



పూదోటలో పట్టుబడిన జెర్రిపోతు

తిరుమలలోని టీటీడీ గార్డెన్‌లో శుక్రవారం జెర్రిపోతు పాము పట్టుబడింది. శ్రీవారిసేవా సదన్‌కు సమీపంలోని టీటీడీ ఫ్లవర్ గార్డెన్‌లో ఆరు అడుగుల పొడవైన పాము ప్రవేశించింది. గుర్తించిన ఉద్యానవన సిబ్బంది పాములు పట్టే టీటీడీ ఉద్యోగి భాస్కర్‌నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన అక్కడికి చేరుకుని పామును పట్టుకుని దట్టమైన అడవిలో విడిచిపెట్టాడు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఎల్ మురుగన్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కేంద్రమంత్రి ఎల్.మురుగన్, రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ప్రభుత్వ విప్ వెంకటరావు, ఉత్తరప్రదేశ్ మంత్రి సంజయ్‌సింగ్, ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, జనార్దన్‌రావు, నక్కా ఆనంద్‌బాబు ఉన్నారు. దర్శనానంతరం ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ మహాజాతరను తలపించేలా జరిగిన మహానాడు పసుపు పండగను చూసి శ్రీవారి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చానని చెప్పారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా ఎంపికైన చంద్రబాబుకు పూర్తి ఆశీస్సులు ఇవ్వాలని కోరుకున్నట్లు తెలిపారు. అంతకుముందు మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, మురుగన్ తిరుచానూరు పద్మావతీ అమ్మవారిని దర్శించుకున్నారు.



ఆనం రామనారాయణరెడ్డి

- తిరుమల, ఆంధ్రజ్యోతి


సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి పార్క్‌లో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.42 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 69,019

తలనీలాలు సమర్పించినవారు: 37,774





పంబలేరు వాగుపై ఉన్న చప్టా



పంబలేరు వాగుపై నిర్మించి, అసంపూర్తిగా ఉన్న వంతెన



పంబలేరు వాగులో నీటి ప్రవాహం(ఫైల్ ఫొటో)

గట్టెక్కని పంబలేరు వంతెన

అప్రోచ్ రోడ్లు నిర్మించక నిరుపయోగం

రూ.8 కోట్లు అవసరమని అంచనా

అధ్వానదారిలో తప్పని రాకపోకలు

గూడూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): అప్రోచ్ రోడ్లు నిర్మించకపోవడంతో కోట్ల రూపాయల వ్యయంతో పూర్తి చేసిన హైలెవెల్ వంతెన వినియోగంలోకి రాని వైనమిది. హైవేల అభివృద్ధికి మునుపు నెల్లూరు నుంచి గూడూరుకు, గూడూరు మీదుగా వెంకటగిరి, తిరుపతి, రాపూరు మార్గాలకు బైపాస్ రోడ్డు నుంచి పంబలేరు చప్టా మీదుగా రాకపోకలు సాగించేవారు. వరద వస్తే ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా ఉండేది. వరదనీరు పంబలేరు వాగు ద్వారా చిల్లకూరు మండలం తిప్పగుంటపాళెం వద్ద కండలేరు క్రీక్‌లో కలసి గుమ్మళ్లదిబ్బ సమీపంలోని సముద్రంలోకి చేరుతుంది. వరద సమయంలో చప్టాపై పది అడుగుల మేర నీరు ప్రవహించేది. దీంతో చప్టా కనిపించక రాకపోకలు నిలిచిపోయేవి. సాహసించి ప్రయాణించిన వారు మృత్యువాతపడిన సందర్భాలున్నాయి. ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వరద ఉధృతికి వాగులో కొట్టుకుపోయి సుమారు పదిహేను మంది వరకు ప్రాణాలు కోల్పోయిన సంఘటనను జిల్లా ప్రజలు మర్చిపోలేరు.

ఏడాదిన్నర క్రితం వంతెన పూర్తి

ప్రమాదాల నివారణకు పంబలేరు చప్టాపై హైలెవల్ వంతెన నిర్మాణమొక్కటే మార్గం. కాలక్రమేణా విజయవాడ-చెన్నై జాతీయ రహదారి నిర్మాణం పూర్తి అయ్యింది. దీంతో నెల్లూరు వైపు నుంచి గూడూరుకు పంబలేరు చప్టా వైపు నుంచి కాకుండా హైవే మీదుగా పోటుపాళెం కూడలి నుంచి మార్గం ఏర్పడింది. అయినా ఎక్కువమంది గూడూరు పట్టణ వాసులు దగ్గర దారి కావడంతో పంబలేరు చప్టాపై నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. నెల్లూరు వైపు నుంచి తిరుపతి, రాపూరుకు దగ్గర కావడంతో ఈ మార్గంలోనే వెళతారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అప్పటి, ప్రస్తుత ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సీఎం చంద్రబాబుతో చర్చించి పంబలేరు చప్టాపై హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ.19.5 కోట్లు మంజూరు చేయించారు. 2019లో వంతెన పనులకు శంకుస్థాపన చేశారు. పనులను రెండేళ్లలోగా పూర్తి చేయాలని నిర్దేశించారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడం, టీడీపీ ప్రభుత్వం మారడంతో పనులు నత్తనడక సాగాయి. ఎట్టకేలకు 2023 డిసెంబరులో పనులు పూర్తయ్యాయి.



వంతెన పూర్తయినా ఇరువైపులా నిర్మించని అప్రోచ్ రోడ్లు

నిధుల కోసం నిరీక్షణ

వంతెన నిర్మించినా నిరుపయోగంగానే నిలిచిపోయింది. ఎందుకంటే అప్రోచ్ రోడ్లకు నిధులు చాలలేదు. దీంతో రాకపోకలకు కష్టాలు తీరలేదు. దీనికితోడు చప్టా నుంచి హైవేకి వెళ్లే మార్గం అధ్వానంగా తయారైంది. ఈ నేపథ్యంలో ఎలాగైనా వంతెనను వినియోగంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ గట్టి సంకల్పంతో కృషి చేస్తున్నారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.8 కోట్లు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. ఇటీవల జరిగిన మినీమహానాడులో సైతం పంబలేరు వంతెనను అందుబాటులోని తెస్తామని తీర్మానించారు. నిధులు మంజూరు చేసి అప్రోచ్ రోడ్లు నిర్మిస్తే పంబలేరు హైలెవెల్ వంతెన వినియోగంలోకి వస్తుంది. పట్టణ ప్రజల సుదీర్ఘకాల కోరిక నెరవేరుతుంది.

జీవవైవిధ్య పరిరక్షణకు చర్యలు

● **జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్**



మంగళం, మే 30(ఆంధ్రజ్యోతి): శేషాచల కొండల్లో అరుదైన జీవవైవిధ్యాన్ని పరిరక్షించడానికి చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ స్పష్టం చేశారు. ఆంధ్రజ్యోతి దిన పత్రికలో కొన్ని రోజుల క్రితం జీవవైవిధ్య పరిశోధనలకు ఫుల్‌స్టాప్ అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ స్పందించారు. ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ శేషాచల జీవవైవిధ్య పరిశోధనలపై వచ్చిన కథనం తనను ఉత్సాహపరిచిందన్నారు. పరిరక్షణకు, పరిశోధనలకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే పరిశోధనశాలను మరమ్మతు చేస్తున్నామన్నారు. ముగ్గురు పరిశోధకులను, అవసరమైతే మరొకరిని నియమించి పూర్తిస్థాయి పరిశోధనలు జరిగేలా చూస్తామన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని, అవసరమైతే అటవీ శాఖ సొంత నిధులతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుత, పరిశోధనలలో వచ్చే సమాచారాన్ని డిజిటలైజేషన్ చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు.

మహిళకు లైంగిక వేధింపులు

● **యూట్యూబర్ హేమాద్రితో పాటు మరొకరిపై కేసు నమోదు**



హేమాద్రి

తిరుచానూరు, మే 30(ఆంధ్రజ్యోతి): మహిళను లైంగికంగా వేధించిన యూట్యూబర్‌తో పాటు మరొకరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం మంగళం క్వార్టర్స్‌కు చెందిన కల్లూరి హేమాద్రి స్థానికంగా ఓ వివాహితను లైంగికంగా వేధిస్తున్నాడు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సప్ ద్వారా మెసేజీలు చేసి వేధించేవాడు. ఫొటోలు మార్ఫింగ్ చేసి, సోషల్ మీడియాలో పెడతానని బెదిరించేవాడు. రెండు రోజుల క్రితం హేమాద్రి తన సన్నిహితురాలు నాగవర్ధిని నివాసానికి ఆ వివాహితను రప్పించి బెదిరించాడు. దీంతో బాధితురాలు తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో హేమాద్రితో పాటు అతని సన్నిహితురాలు నాగవర్ధనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. హేమాద్రిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు చెప్పారు. గతంలోనూ ఇతనిపై అనేక ఆరోపణలు ఉన్నాయని, కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి.

భవిష్యత్తు అవసరాల కోసం..

● **పాపవినాశనం, ఆకాశగంగ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించండి**

● **టీటీడీ ఈవో శ్యామలరావు**

తిరుమల, మే 30(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆకాశగంగ, పాపవినాశనం, గదులు కేటాయించే సీఆర్వో(సెంట్రల్ రిసెప్షన్ ఆఫీస్) అభివృద్ధి, ఆధునికీకరణపై టీటీడీ ఈవో శ్యామలరావు తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం సమీక్షించారు. ఈ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి నిపుణులు రూపొందించిన ప్రణాళికలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈవో మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆకాశగంగ, పాపవినాశనం ప్రాంతాల పర్యావరణ, ఆధ్యాత్మిక అభివృద్ధికి రూపకల్పన చేయాలన్నారు. ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. సీఆర్వోను కూడా ఆధునికీకరించి, భక్తులు సులువుగా గదులు పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. సమీక్షలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీఈ సత్యనారాయణ, అర్బన్ డెవలప్మెంట్ అండ్ డిజైనింగ్ నిపుణులు రాముడు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి పగాకు


ధూమపానంతో పెరుగుతున్న క్యాన్సర్ల ముప్పు

నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం

'నా పేరు ముకేష్... ఒక సంవత్సరం గుట్కా నమిలాను... నోటి క్యాన్సర్ ఆపరేషన్ జరుగుతోంది, బహుశా ఇక నేను మాట్లాడలేపోవచ్చు...'ప్రతి సినిమా ప్రారంభానికి ముందు వచ్చే ఈ మాటలు అందరినీ ప్రభావితం చేస్తాయి. అనారోగ్య హేతువైన ధూమపానం ఎంత ప్రమాదకరమో దృశ్య రూపంలో వివరించి ఆందోళన కలిగిస్తాయి.

- చిత్తూరు రూరల్, ఆంధ్రజ్యోతి





సరదాగా ప్రారంభించే ధూమపానం మానలేని వ్యసనంగా మారుతుంది. పొగాకులోని నికోటిన్, విషతుల్యాలు ఊపిరితిత్తులు, గుండె జబ్బుల వంటి దీర్ఘకాల వ్యాధుల దగ్గర నుంచి క్యాన్సర్ల వరకూ దారితీస్తాయని వైద్యులు చెబుతున్నారు.. మన దేశంలో రోగాలకు, మరణాలకు కారణమవుతున్న ప్రధాన అంశాల్లో పొగాకు అలవాటు ఒకటి. మన జిల్లాలో 15, అంతకన్నా ఎక్కువ వయసు పైబడిన వారిలో సుమారు 30 శాతం మంది పొగ తాగుతున్నట్లు ఒక అంచనా. పొగాకు కారణంగా క్యాన్సర్ బారిన పడిన వారి సంఖ్య కూడా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. 2022-23లో దీని కారణంగా 1729 మంది క్యాన్సర్ బారినపడితే. 2024- 25(ఇప్పటివరకూ) ఆ సంఖ్య 2564కు చేరింది.

జిల్లాలో పొగాకు వల్ల క్యాన్సర్ బారిన పడిన వివరాలు..

సంవత్సరం	బాధితులు
2022-23	1729
2023-24	2335
2024-25 నేటి వరకు	2564

గుండెకు ప్రధాన శత్రువు

గుండెపోటు కేసుల్లో 25 శాతం వరకు పొగాకే కారణమవుతోందని భావిస్తున్నారు. సిగరెట్ల సంఖ్య పెరిగేకొద్దీ గుండెజబ్బు ముప్పూ పెరుగుతోందని డాక్టర్లు చెబుతున్నారు. రోజుకు 20 సిగరెట్లు కాల్చేవారితో పోలిస్తే ఒకటి రెండు తాగేవారికీ గుండెపోటు ముప్పు 40-50 శాతం తక్కువగా ఉంటుందంటున్నారు. పొగాకులో నికోటిన్, విషతుల్యాలు రక్తనాళాలను దెబ్బతీసి పూడిక ఏర్పడుతుంది. పూడిక చిట్లిపోతే రక్తం గడ్డకట్టి నాళం మూసుకుపోయి గుండెపోటుకు దారితీస్తుంది. పొగ మూలంగా పెదవి, నోరు, నాలుక, జీర్ణాశయం, ఊపిరితిత్తులు, పాంక్రియాస్, కాలేయం, మూత్రాశయం, కిడ్నీ క్యాన్సర్ల వంటివెన్నో తలెత్తుతాయి.

చట్టం ఏం చెబుతుందంటే...

చట్ట ప్రకారం బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, సినిమా హాళ్లు, మార్కెట్లు, విద్యా సంస్థలు, ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, జనసంచార ప్రదేశాల్లో ధూమపానం నిషేధం. ఈ నిబంధన అతిక్రమించిన వారికి రూ.200 జరిమానాతో పాటు జైలు శిక్ష అమలుచేస్తారు. 18 ఏళ్ల లోపు వయసున్న వారికి పొగాకు ఉత్పత్తులు విక్రయించకూడదు. విద్యాసంస్థలకు వంద గజాల్లోపు వీటిని అమ్మడం నిషేధం. గుట్కా, ఖైనీ, పాన్, జర్దా వంటి పొగాకు వివియోగించే వారిలో అత్యధికులు 13 నుంచి 15 ఏళ్ల వయసున్న వారే ఎక్కువగా ఉన్నట్లు ఓ అధ్యయనంలో తేలింది.

డ్రగ్స్ నియంత్రణకు సమన్వయం ముఖ్యం

విద్యాసంస్థలో ఈగల్ క్లబ్‌ల ఏర్పాటు

తిరుపతి (కలెక్టరేట్), మే 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నియంత్రణకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి నార్కోటిక్ కంట్రోల్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ముఖ్యంగా విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటుచేయాలని సూచించారు. డ్రాప్ బాక్సులను ఏర్పాటు చేయాలన్నారు. వారం రోజుల్లో డిఅడిక్షన్ సెంటర్‌లో వసతులు కల్పించి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఔషధనియంత్రణ అధికారులు సంయుక్తంగా మందుల దుకాణాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. డ్రగ్స్ వినియోగం, రవాణాపై నిఘాను పెంచి అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. 1972టోల్‌ఫ్రీ నెంబర్‌పై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల సరఫరా చేసేవారి వారి ఆస్తులను జప్తు చేస్తామని తెలిపారు. గంజాయి రవాణా హాట్ స్పాట్లను గుర్తించి నిఘా ఉంచామని తెలిపారు. అనంతరం మాదక ద్రవ్యాల నిషేధం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్య క్రమంలో డీఆర్వో నరసింహులు, ఆర్డీవోలు, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, డీఈవో కుమార్, ఆర్డీవో మురళీమోహన్, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ రాధ, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వాసుదేవ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తదితరులు

శ్రీసిటీలో ముగిసిన వేసవి శిబిరం

సత్యవేడు, మే 30 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని నైపుణ్య శిక్షణ కేంద్రంలో శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నలభై రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఏప్రిల్ 9 నుంచి ప్రారంభమైన శిబిరంలో 9వ తరగతితో పాటు టెన్త్, ఇంటర్ విద్యార్థులు 175 మంది హాజరయ్యారు. వీరికి స్పోకెన్ ఇంగ్లీష్, గణిత సూత్రాలు, బేసిక్ కంప్యూటర్ కోర్సు, రాత నైపుణ్యాలు, పోటీ పరీక్షల మెలకువలు, జనరల్ నాలెడ్జి తదితర అంశాలను బోధించారు. యోగా, టెన్నిస్ తదితర క్రీడల్లో తర్ఫీదునిచ్చారు. క్విజ్ పోటీలు, ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించారు. ఫైర్ సేఫ్టీ, ప్రాథమిక ఆరోగ్య చికిత్సల పట్ల ప్రత్యక్ష అభ్యసన ద్వారా అవగాహన కల్పించారు. తిరుపతిలోని జంతు సంరక్షణ కేంద్రం, సైన్స్ సెంటర్ క్షేత్ర పర్యటనలు, శ్రీసిటీలోని పెప్సీ, వైటల్ పేపర్స్ పరిశ్రమలు, నర్సరీ సందర్శనలకు తీసుకెళ్లారు. శ్రీసిటీ సీఎస్సార్ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి ఈ కార్యక్రమాలను రూపొందించి మార్గనిర్దేశం చేశారు. కాగా వేసవి శిబిరానికి శిక్షకులుగా రజిత (క్రాఫ్ట్), దుష్యంత్ (పోటీ పరీక్షలు), ఉమా, నేహా (వ్యక్తిత్వ వికాసం), సాయిలక్ష్మి (ఇంగ్లీష్), సౌమ్య (కంప్యూటర్ కోర్స్), కోదండం (యోగా, కరాటే) వ్యవహరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు వేడుకల్లో విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ రమేష్‌కుమార్, శ్రీరామచంద్ర, మెడికల్ సెంటర్ డాక్టర్ సులోచన, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధులు, శిక్షకులు





వివరాలు వెల్లడిస్తున్న సీఐ బాబి, ఎస్ఐ ఆదిలక్ష్మి

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

నాయుడుపేట టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): భార్య హత్య కేసులో భర్తను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. నాయుడుపేట సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం మీడియాకు వివరాలు వెల్లడించారు. నాయుడుపేట మండలం కాలవగట్టు సమీపంలో నివాసం ఉంటున్న మాణికల శ్రీనివాసులు, ఆయన భార్య కృష్ణవేణి ఈనెల 17వ తేదీన కూలి పనుల కోసం చిట్టమూరు మండలం గునపాడుకు వెళ్లారు. సాయంత్రం పని పూర్తయ్యాక భార్యభర్తలు ఇద్దరూ కల్లుతాగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో కృష్ణవేణి స్వర్ణముఖినదిలోకి దిగింది. అదే సమయంలో భర్త శ్రీనివాసులుతో చిన్నపాటి వివాదం ఏర్పడింది. ఈ క్రమంలో శ్రీనివాసులు రాయితో తన భార్య ముఖంపై బలంగా కొట్టాడు. అప్పటికే ఆమెపై అనుమానం ఉండడంతో వదిలించుకోవాలని గొంతుపై కాలితో తొక్కి హతమార్చాడు. మృతురాలు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్నం నాయుడుపేట - మల్లాం జంక్షన్ కూడలి వద్ద శ్రీనివాసులును అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేయడంలో ప్రతిభ కనపరచిన ఎస్ఐ ఆదిలక్ష్మి, సిబ్బంది పోలయ్య, దయాకర్, వెంకటేశ్వర్లును సీఐ అభినందించారు.

మేర్లపాక వద్ద టోల్‌గేట్ ప్రారంభం

ఏర్పేడు, మే 30(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై ఏర్పేడు మండలంలోని మేర్లపాక వద్ద టోల్‌గేట్ ఏర్పాటు చేశారు. దీన్ని శుక్రవారం నేషనల్ హైవేస్ పీడీ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. నిబంధనల మేరకు వాహనాల వద్ద రుసుం వసూలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల శాఖ అధికారులు, ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.